క్లుప్తంగా

దీపావళి వేడుకలు



టపాసులు కాలుస్తూ..

తోటపల్లిగూడూరు: దీపావళి పండగను మండల ప్రజలు గురువారం సాయంత్రం ఘనంగా చేసుకున్నారు. పిల్లలు, యువత బాణసంచా కాల్చారు. ఉదయం దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో గంగమ్మ

పొదలకూరు: స్వాతి నక్షత్రం సందర్భంగా పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం ఉదయం లక్ష్మీనరసింహస్వామికి అభిషేకం నిర్వహించారు. ఉభయకర్తలుగా కొత్తూరు శ్రీనివాసులు – రజినీ దంపతులు వ్యవహరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

• **మనుబోలు:** మండలంలోని మనుబోలు చెరువు కట్ట వద్ద ఉన్న గంగమ్మ పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు సుబ్రహ్మణ్యం శర్మ అమ్మవారికి క్షీర, పంచామృతాభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. కార్యక్రమానికి శ్రీ శివబాలాజీ సూపర్ మార్కెట్ అధినేత జనార్దననాయుడు, రాధిక దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

పాముకాటుకు గురైన ఉపాధి కూలీ

విడవలూరు: మండలంలోని ఊటుకూరుకు చెందిన ఉపాధి హామీ కూలీ మీసాల కవిత శుక్రవారం పాము కాటుకు గురైంది. స్థానికుల కథనం మేరకు.. ఊటుకూరు గ్రామానికి చెందిన కవిత రోజూలాగే శుక్రవారం ఉపాధి హామీ పనులకు వెళ్లింది. కాలువలో పనిచేస్తున్న సమయంలో పాము కాటుకు గురైంది. వెంటనే తోటి కూలీలు ఆమెను విడవలూరులోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం ఆమెను నెల్లూరులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అనంతరం ఆమె సురక్షితంగా ఇంటికి చేరిందని, ఎలాంటి ప్రమాదం లేదని ఎంపీడీఓ నగేష్‌కుమారి తెలిపారు.

సామాజిక పింఛన్లతో ఆసరా



నార్తురాజుపాళెంలో పింఛన్ అందజేస్తున్న డీఆర్‌డీఏ పీడీ

కొడవలూరు : దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు సామాజిక పింఛన్‌లు ఎంతో ఆసరాగా ఉంటున్నాయని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి అన్నారు. మండలంలోని నార్తురాజుపాళెంలో ఆమె శుక్రవారం సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం పింఛన్‌ను రూ.4 వేలకు పెంచడంతో పాటు ఇంటి వద్దకే ఒకటో తేదీన అందిస్తూ బాసటగా నిలుస్తోందన్నారు. సచివాలయ సిబ్బంది ఒకటో తేదీనే వంద శాతం పింఛన్ల పంపిణీ జరిగేలా కృషి చేయాలని కోరారు. వికలాంగుల సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ సంధ్యారాణి, వెలుగు ఏపీఎం కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి శ్యామ్‌సుందర్, సీసీ ఖాజామస్తాన్, వీఓఏలు మాలిని, కవిత, స్థానిక నేత బండి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

• **కోవూరు :** కోవూరులో జరుగుతున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలువురికి పింఛన్లు అందజేశారు. ఎంపీడీఓ చిలకల శ్రీహరిరెడ్డి, ఏపీఎం సుబ్బరావు ఉన్నారు.

ఇద్దరు విద్యార్థుల డిబార్

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో శుక్రవారం జరిగిన డిగ్రీ ఐదో సెమిస్టర్ ఎగ్జామ్‌లో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారని పరీక్షల నిర్వహణాధికారిణి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. 7,305 మందికి గానూ 6,740 మంది హాజరైనట్లు వెల్లడించారు. నాయుడుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నెల్లూరు నగరంలోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో ఒక్కో విద్యార్థి డిబార్ అయినట్లు తెలిపారు.

పింఛన్ల పంపిణీ

విడవలూరు: మండలంలోని చౌకచర్లలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి శుక్రవారం పాల్గొన్నారు. గ్రామంలోని పలువురు వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు అందజేశారు. అనంతరం విడవలూరు ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న కేన్సర్ స్క్రీనింగ్ టెస్టులను పరిశీలించారు.

నీరు విడుదల చేయండి సారూ..

- అధికారులను కోరుతున్న రైతులు
- ఐఏబీ సమావేశం నిర్వహించాలని వినతి



సోమశిల దక్షిణ కాలువ (ఫైల్)

పొదలకూరు: 'ముందుగా సాగునీటిని విడుదల చేస్తే సకాలంలో పంటలు పండించుకుని గిట్టుబాటు ధరలకు ధాన్యాన్ని అమ్ముకుంటాం' ఇది జలవనరుల శాఖ అధికారులకు రైతులు చేస్తున్న విజ్ఞప్తి. సోమశిల దక్షిణ కాలువ చివరి ఆయకట్టుగా ఉన్న మండలంలోని నావూరు, చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం, బత్తులపల్లి, చేజర్ల మండలం కొండలరాయుడుకండ్రిక గ్రామాల రైతులు రబీలో వరి సాగుకు సన్నద్ధమవుతున్నారు. అయితే ఏటా కోతల పనుల్లో జాప్యం జరుగుతుండడంతో ధాన్యాన్ని అమ్ముకునేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అంతేకాక చివరి ఆయకట్టులో ఉన్న వీరు పంటలు పండించుకునేందుకు చివరి తడి సాగునీటి కోసం అధికారులను వేడుకోవాల్సి వస్తోంది.

కాలువల ద్వారా..

దక్షిణ కాలువ, దాని ఉపకాలువలైన 7ఆర్, 26ఎల్, 27ఎల్, 28ఎల్ ద్వారా పైగ్రామాలకు సాగునీరు అందుతోంది. నావూరు చెరువును కూడా కాలువ ద్వారానే నింపి గత మూడేళ్లగా పంటలు పండించుకుంటున్నారు. 27ఎల్, 28ఎల్ కాలువల ద్వారా డైరెక్ట్ ఆయకట్టు కూడా ఉండడంతో రైతులు వరి సాగు పైనే ప్రధానంగా ఆధారపడుతున్నారు. ఈ గ్రామాల్లో సుమారు మూడు వేల ఎకరాల ఆయకట్టు ఉండడంతో చివరి తడి కోసం రైతులు తహతహలాడాల్సి వస్తోంది. సోమశిలలో పుష్కలంగా నీటి నిల్వలు ఉన్నందున అధికారులు అనుమతులు తీసుకుని త్వరితగతిన సాగునీటిని కాలువలకు విడుదల చేస్తే నార్లు పోసుకుని నవంబరు నాటికి నాట్లు పూర్తి చేసుకుంటామంటున్నారు.

సమావేశం పెట్టాలి

ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి వీలైనంత త్వరగా ఐఏబీ (సాగునీటి సలహా మండలి) సమావేశం నిర్వహించి సోమశిల, కండలేరు జలాల కేటాయింపులను నిర్ణయించాల్సిందిగా నాన్ డెల్టా రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ముందుగా కేటాయింపులు జరిగితే వాటిని అనుసరించి నార్లు పోసుకునేందుకు అవకాశం ఉంటుంది. నాన్ డెల్టాపై సానుకూలంగా స్పందించి నీటి కేటాయింపులను చేపట్టాల్సిందిగా కోరుతున్నారు.

నార్లు పోసుకుంటున్న రైతులు

ఇటీవల తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు నార్లు పోసుకునేందుకు ఉపయోగపడే నీరు చెరువుల్లో చేరింది. అంతేకాక బోర్ల కింద కూడా ముందుస్తుగా కొందరు రైతులు నార్లు పోసుకుంటున్నారు. తొలుత నాటు పడితే చివరి ఆయకట్టుకు ఇబ్బందులు తలెత్తవనేది రైతుల అభిప్రాయం. ఫలితంగా కొందరు నార్లు పోసుకునే పనిలో పడ్డారు. అధిక సంఖ్యలో కేఎన్ఎం – 1638 రకం వరివిత్తనాలను నార్లు పోసుకుంటున్నట్లుగా తెలిసింది. కొందరు అన్నదాతలు బీపీటీ – 5204 రకం విత్తనాలను కూడా కొనుగోలు చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు ఈ రకం విత్తనాలను ఒక కిలోకు రూ.5 వంతున రాయితీ ప్రకటించి అందజేస్తున్నారు.

అభివృద్ధి పనులను అడ్డుకోవడం దారుణం



మాట్లాడుతున్న సేవానాథం ట్రస్ట్ సభ్యులు

మనుబోలు: సేవానాథం ట్రస్ట్ ఆధ్వర్యంలో మనుబోలు మండల కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అడ్డుకోవడం దుర్మార్గమని ఆ ట్రస్ట్ సభ్యులు అన్నారు. వారు శుక్రవారం మనుబోలులో విలేకరులతో మాట్లాడారు. పేద విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు మండల కేంద్రంలో సేవానాథం ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను, యువత కోసం జిమ్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. భవన నిర్మాణానికి గ్రావెల్ తరలిస్తుంటే టీడీపీ నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, కలికి రమేష్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ట్రస్ట్ ఫౌండర్ మాచిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డికి ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధాలు లేవన్నారు. గతంలో కాకాణిని ట్రస్ట్ కార్యక్రమాలకు ఆహ్వానించామని టీడీపీ నేతలు పనులను అడ్డుకోవడం తగదన్నారు. సభ్యులు విజయ్, భార్గవ్, మహిధర్ తదితరులు పాల్గొన్నారు.

• కాగా దీనిపై టీడీపీ నేతలు మాట్లాడుతూ రైతులు వెళ్లే దారిని అడ్డగించి నిర్మాణాలు చేపడుతున్నందునే పనులకు గ్రావెల్ తరలింపును అడ్డుకున్నామని తెలిపారు.

మర్యాదపూర్వకంగా..

కొడవలూరు: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆ పార్టీ జిల్లా విద్యార్థి విభాగం కార్యదర్శి జడ్డా సాయికుమార్ బుధవారం పులివెందులలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాయికుమార్ మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు.

బీసీజీ వ్యాక్సిన్‌పై అవగాహన పెంచాలి

• అదనపు డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ



యల్లాయపాళెం పీహెచ్‌సీలో వైద్యసేవలను పరిశీలిస్తున్న ఖాదర్‌వలీ

కొడవలూరు: పెద్దల బీసీజీ వ్యాక్సిన్‌పై గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన పెంచాలని అదనపు డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ సూచించారు. మండలంలోని యల్లాయపాళెం పీహెచ్‌సీని శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి రికార్డులు పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. అదేవిధంగా ఇంటింటి సర్వే చేసి టీబీ, లెప్రసీ కేసులు ప్రాథమిక దశలో ఉంటే గుర్తించి వైద్యం అందించాలని చెప్పారు. పీహెచ్‌సీ వైద్యాధికారులు కావ్య, జనార్దన్, హెచ్‌ఎస్‌లు సురేంద్ర, రజియ, ఎస్‌టీఎస్ సత్యనారాయణ, స్టాఫ్‌నర్స్ స్వర్ణలత, ఫార్మాసిస్ట్ లక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ నరేష్ ఉన్నారు.

యథేచ్ఛగా ఇసుక తరలింపు



జాతీయ రహదారి పక్కన డంప్ చేసిన ఇసుక



బుచ్చిరెడ్డిపాళెం లేఅవుట్‌లో తోలిన ఇసుక, తువ్వ

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం మండలంలో ఇసుక తరలింపు యథేచ్ఛగా కొనసాగుతోంది. తాజాగా మూతపడిన కాగులపాడు రీచ్ నుంచి ఇసుకను ముంబై జాతీయ రహదారి పక్కన డంప్ చేసి టిప్పర్లకు, టర్బోల ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. కాగులపాడు ఇసుక రీచ్‌ను మూతవేసి నాలుగు సంవత్సరాలు అయినప్పటికీ కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంలో అక్రమ తరలింపు జరుగుతోంది. కాగులపాడు పంచాయతీ బాపనపాడుకు చెందిన పుత్తేడు శివకుమార్‌రెడ్డి అనుచరులు తరలిస్తున్నట్లు స్థానికులు వెల్లడిస్తున్నారు. ఇతనిపై గతంలో లెక్కకు మించి ఇసుక అక్రమ తరలింపు కేసులు ఉన్నాయి. ఆయన వినియోగించే ట్రాక్టర్లకు నంబర్ ప్లేట్లు లేనప్పటికీ పోలీసు శాఖ చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తోంది. కాగా గురువారం రాత్రి కాగులపాడు నుంచి పదుల సంఖ్యలో ట్రాక్టర్లు బుచ్చిరెడ్డిపాళెంలోని లేఅవుట్లకు తరలిస్తున్న వ్యవహారంపై పోలీసులకు సమాచారం ఇచ్చినా వారు ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

వందల సంఖ్యలో బెల్టు షాపులు



సౌత్‌ఆములూరులోని బెల్టు షాపు

తోటపల్లిగూడూరు: కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త మద్యం పాలసీ కారణంగా పల్లెల్లో మద్యం ఏరులై పారుతోంది. మండలంలో అధికారికంగా ఐదు మద్యం షాపులుండగా వందల సంఖ్యలో బెల్టు షాపులు వెలుస్తున్నాయి. సౌత్‌ఆములూరు పంచాయతీలో సుమారు 8 మద్యం బెల్టు షాపులున్నట్లు సమాచారం. మహాలక్ష్మీపురం, నరుకూరు దుకాణాల నుంచి నిర్వాహకులు రోజూ పదుల సంఖ్యలో మద్యం కేసులను దిగుమతి చేసుకుంటూ వ్యాపారం సాగిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పోటీ పడుతూ క్వార్టర్ బాటిల్ కొనుగోలుపై వాటర్ ప్యాకెట్లు ఫ్రీ, కోడిగుడ్డు ఫ్రీ అంటూ మందుబాబులకు ఆఫర్లు ఇస్తున్నారు. ఆక్వా సాగుకు సంబంధించి చేపల పెంపకంలో సౌత్‌ఆములూరుకు జిల్లాలోనే గుర్తింపు ఉంది. ఇప్పటి వరకు ఎంతో ప్రశాంతంగా ఉన్న ఈ పంచాయతీలో మద్యం ఏరులై పారుతున్న నేపథ్యంలో వివాదాలు చోటు చేసుకునే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి బెల్టు దుకాణాలకు అడ్డుకట్టు వేయ్యాల్సిన అవసరం ఎంతైన ఉంది.

ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం



అమరజీవి విగ్రహం వద్ద ఆర్యవైశ్య నాయకులు

పొదలకూరు: పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద శుక్రవారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఆర్యవైశ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆదూరు వెంకటసుబ్బయ్య, ఆమల్లలూరు చెంచయ్య, తన్నీరు సురేష్, సుధాకర్, మీరా మధు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసై చోరీల బాట



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ సౌజన్య, డీఎస్పీ శ్రీనివాసరావు

• విద్యుత్ మోటార్ల దొంగల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మోటార్లు

ముత్తుకూరు: మండలంలోని పంట పొలాల్లో విద్యుత్ మోటార్లను చోరీ చేసిన నిందితులను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఏఎస్పీ సౌజన్య, నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, కృష్ణపట్నం సీఐ రవి నాయక్‌లు ముత్తుకూరు సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని నారికేళపల్లికి చెందిన పొదర్తి వెంకటేష్, ఆములూరు ప్రవీణ్, ఆములూరు బద్రి, మాతంగి వినయ్, ఆములూరు పవన్, ఆములూరు వంశీ, మోమిడి రాజా, మరో ఇద్దరు మైనర్లు చెడు అలవాట్లకు బానిసయ్యారు. కొద్దిరోజులుగా రూ.8.70 లక్షల విలువైన 43 విద్యుత్ మోటార్లను చోరీ చేశారు. పంటపాళెం సమీపంలోని నక్కల కాలువ వంతెన కింద తిరుగుతుండగా వీరిని అదుపులోకి తీసుకున్నారు. మోటార్లు, చోరీలకు వినియోగించిన రూ.2.80 లక్షల విలువైన ఒక ఆటో, రెండు బైక్‌లు, ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. చోరీ సొత్తు మొత్తం విలువ రూ.11.50 లక్షలని ఏఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకున్న ఎస్సైలు విశ్వనాథరెడ్డి, శ్రీనివాసరెడ్డితోపాటు పోలీసులను కూడా అభినందించి రివార్డు అందజేశారు.

బస్సు ఢీకొని తల్లీకుమార్తెకు గాయాలు

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెంలోని రాఘవరెడ్డి కాలనీ వద్ద జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న తల్లీకుమార్తెను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వారు గాయపడిన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. నెల్లూరు–1 డిపోకు చెందిన బస్సు పామూరు నుంచి నెల్లూరు వైపు వస్తున్న సమయంలో రోడ్డు దాటుతున్న తల్లీకుమార్తెను ఢీకొంది. ఈ ప్రమాదంలో తల్లికి తీవ్రగాయాలు కాగా కుమార్తెకు స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. వారిని వైద్యశాలకు తరలించారు. ఈ ఘటన వల్ల ముంబై జాతీయ రహదారిపై రాకపోకలు స్తంభించాయి. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఆలయాల్లో కార్తీక శోభ



పద్మావతి సమేత చంద్రశేఖరస్వామి ఆలయం



టీపీగూడూరు: వరిగొండ జ్వాలాముఖి అమ్మవారి ఆలయం



పొదలకూరు: కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానం



పేడూరులోని చార్ముడమ్మ ఆలయం

- నేటి నుంచి కార్తీక మాసం ప్రారంభం
- దీపాలు వెలిగించనున్న మహిళా భక్తులు
- వనభోజనాలకు ఏర్పాట్లు

తోటపల్లిగూడూరు: కార్తీక మాసం సందర్భంగా శనివారం నుంచి ఆలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందు కోసం ఆయా కమిటీలు ఏర్పాట్లు చేశాయి. ఈ మాసంలో వనభోజనాలు జరగడం ఆనవాయితీ. మండలంలో మూడుచోట్ల ప్రత్యేకంగా చేస్తారు. అందులో ఒకటి వరిగొండలో ఉన్న జ్వాలాముఖి అమ్మవారి ఆలయం, రెండోది కాటేపల్లిలోని పద్మావతి సమేత చంద్రశేఖర స్వామి ఆలయం(శివాలయం), మూడోది పేడూరులో కొలువుదీరిన చార్ముడమ్మ అమ్మవారి ఆలయం.

శతాబ్దాల చరిత్ర

ఒకప్పటి ఈతముక్కలమ్మే నేడు జ్వాలాముఖిగా పేరు గడించింది. వరిగొండ దేవళాలమిట్టలో ఉన్న జ్వాలాముఖి అమ్మవారి ఆలయానికి శతాబ్దాల చరిత్ర ఉంది. సంతానలక్ష్మిగా, సౌభాగ్యలక్ష్మిగా అమ్మవారు పేరు పొందారు. సువిశాలమైన ఆలయ ప్రాంగణం, మర్రిచెట్టు భక్తులను ఆకట్టుకుంటుంది. జిల్లాలోనే గుర్తింపు కలిగిన ఆలయం వనభోజనాలకు అనువుగా ఉంటుంది. ప్రతి ఏడాది ఇక్కడ అనేక కుల సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయి.

కాటేపల్లి శివాలయం

కాటేపల్లిలో ఉన్న పద్మావతి సమేత చంద్రశేఖర స్వామి ఆలయంలో ప్రతి ఏడాది పెద్ద సంఖ్యలో వనభోజనాలు జరుగుతాయి. ఆలయానికి ఉన్న విశిష్ట గుర్తింపు కారణంగా నిత్యం భక్తులు విచ్చేస్తుంటారు. కార్తీక మాసంలో ఈ సంఖ్య మరింత రెట్టింపవుతుంది. కాటేపల్లి సముద్రతీరం ప్రధాన ఆకర్షణగా ఉంది.

పేడూరు చార్ముడమ్మ ఆలయం

పేడూరు గ్రామ దేవత చార్ముడమ్మ ఆలయానికి శతాబ్దాల చరిత్ర ఉంది. ఇటీవలే అభివృద్ధి పనులు జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. విశాలమైన ప్రాంగణంలో ప్రతి ఏడాది కార్తీక మాసంలో కార్యక్రమాలు జరుగుతాయి. ఈసారి వనభోజనాలకు ఏర్పాట్లను చేస్తున్నారు.

నెలరోజులు

పొదలకూరు: వందల ఏళ్ల చరిత్ర కలిగిన పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి (శివాలయం) దేవస్థానంలో కార్తీకమాస పూజలు శనివారం నుంచి డిసెంబర్ 2వతేదీ వరకు నిర్వహించనున్నారు. మహిళా భక్తులు కార్తీక దీపాలను వెలిగించనున్నారు. గ్రామపెద్దలు ఏర్పాట్లు చేశారు. కార్తీక మాసంలో వచ్చే కోటి సోమవారంకు ఎంతో విశిష్టత ఉంది. మహిళలు ఉపవాసాలుండి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలు వెలిగిస్తారు.

ఎంతో విశిష్టత ఉంది



కార్తీక మాస పూజలకు ఎంతో విశిష్టత ఉంది. శివాలయంలో పెద్దలంతా కలిసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తుంటాం. సాధారణంగా ఈ మాసంలో వర్షాలు కురుస్తుంటాయి. అయినా దీపాలు వెలిగించేందుకు అనువుగా ఏర్పాట్లు చేస్తాం.

– ఎస్.పరంధామిరెడ్డి, పొదలకూరు

పవిత్రమైన మాసం



కార్తీక మాసానికి ఎంతో పవిత్రమైంది. శివునికి ప్రీతిపాత్రమైన మాసం. మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో దీపాలు వెలిగిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయి.

– ప్రసాద్‌స్వామి, దేవస్థానం ప్రధాన అర్చకుడు.